# వాగర్థావివసంపృక్తౌ

వాగర్థా వివ సంపృక్తౌ । వాగర్థ ప్రతిపత్తయే
జగతః పితరౌవన్దే । పార్వతీ పరమేశ్వరా॥

భగవంతుని అర్థనారీశ్వరత్వం మీద, ఉపన్యాసం దంచుతున్నది విశ్వంభరి-

"కాళిదాస మహాకవి త్రియా చదివే, వాల్మీకి రామాయణం చదివే, మనుషులను బాగా పరిశీలన చేసే, రఘువంశం అనే కావ్యం దైవ ప్రార్థనతో మొదలెట్టాడు- వ్యాసమహర్షిచే గానం చేయబడిన భాగవతంలో రఘువంశం వరుసగా చెప్పబడినది- అదీ చదివాడు మహాకవి రఘువంశం పంచకావ్యాలలో ఒకటి- జ్ఞానులెప్పుడూ హరిహరులనూ, అమ్మవారినీఅయ్యవారినీ కలిపే ధ్యానిస్తారు మహాకవి కాళిదాసు ఒక శ్లోకం అల్లాడు సు
దటచదవగానే శివుని ధ్యానిస్తున్నట్టు తెలుస్తుంది- మళ్ళావిరిచి అంతరార్థం తెలుసుకుంటే అమ్మవారినీ ధ్యానిస్తున్నాడు అని తెలుస్తుంది

శ్రోతలలో ఒక విద్యార్థినిలేచి తనకుశంక వెలిబుచ్చింది

అది వొట్టి కవిత్వమేమో మేడమ్, అలా ఎక్కడయినా వుంటారా? మగవాడు మగవాడే, ఆడది ఆడదే-

కూచోచెప్తా, కవిత్వంగాదు ఋగ్వేదంలోనే అలాటి వర్ణన గల ఋక్కు ఉన్నది కద్రువ తన పిల్లలైన పాములను ఆకాశంలో వాహ్యాళికి తిప్పిరమ్మని సవతి కొడుకైన వైనతేయుని వీపుమీద ఉంచేది గరుడుడు పైకెగసిపోయేవాడు- ఇది చూసి కద్రువ తనపిల్లలు మరీ సూర్యుని దాపులకు తీసుకుపోతే వాడి

చస్తారని భయపడి దైవాన్ని వేడుకునేదట, ఓ సువర్ణి నా సవతి కొడుకు నా బిడ్డలను చంపాలని మరీ పై కెగసి పోతున్నాడు- కాపాడు-

సువర్ణి అంటే దైవము, రెండు రెక్కలలాగా శివశక్తులు కలిసే దైవము అని గానం చేశారు-అరణ్యకము అనే భాగంలో ఉన్నది ఆదే పదాన్ని కాళిదాసమహాకవి తన స్వంత భాషలో వాగర్థావివ అన్నాడు అనగ ఒక పదంలోనె దాని యర్థమూ యిమిడి వున్నట్టుండే పార్వతీపరమేశ్వరులకు నమస్కారము-

పరిశోధన చేస్తున్న మరొక విద్యార్థిని తన సంశయము నివారణ చేసుకోవలయునని అడిగింది-

ఒకవేళ మగాడు ఆడదానల్లే కనపడవచ్చు కానీ, ఆడది మగాడల్లే యెలా కనబడుతుంది?

"మీకందరికీ అనుభవం తక్కువ కొంత ప్రపంచమైనా చూడాలి- జాతీయపిత మహాత్మా తన దేశమంతా తిరిగి చూసి తన జాతి పరిస్థితి బాగా అవగాహన చేసుకున్నారు- శంకర భగవత్పాదులు చదువు పిన్న వయస్సులోనె పూర్తి అయింది- గురువులు గౌడపాదులూ గోవిందయతీ విపులట్టి చెప్పారు. చదువుకేం త్వరగానెనెర్చావు శంకరా! కాని దేశాటన చేయనిదీ యేమీ చెప్పలేవు, విశదీకరించలేవు- కనుక ఆసేతు సీతాచలం తిరిగి చూసిరా అప్పుడు నిన్ను గెలిచే వాడుండడు, గురువు ఆజ్ఞ ప్రకారం ఆదిశంకరులు దేశాటనచేసి, కళ్లారా చూసి, అనుభవం సంపాయించారు అద్వైతం వ్యాప్తి చేశారు, యెవరెవరికి పందేహాలున్నాయొ వారంతా నాతొ మా ఊరురండి. అన్ని పర్యటనయాలూ చేస్తాను అన్నది విశ్వంభరి.

శలవులువస్తున్నాయి. ఔత్సాహికులంతా లేచినిలబడ్డారు

2

'ఇది మా బాబాయిగారి యిల్లు. పల్లెటూరు గూడా పట్నమల్లెనెఆనందమిస్తుంది. అంతకంటె మంచితిండే తింటామిక్కడ వీరే గారీనాదంబాబాయిగారు. అడ్వోకేట్. గ్రామీణులకు, రైతులకు న్యాయం ఉచితంగా అందించాలని యీ బ్రాహ్మకోడూరులోనున్నారు మా పిన్ని రామసీత. వాళ్ళ పుట్టిల్లు చెన్నపట్టణం. బాబాయికి ఆస్తి ఉన్నదనీ, బుద్ధిమంతుడనీ పట్నవాసం మామగారు పిల్లనిచ్చారు పిన్ని తండ్రికూడా అడ్వోకేటే. క్రిమినల్ లాయర్. రెండు చేతులా సంపాదన. అని పరిచయం చేసింది విశ్వంభరి.

బాబాయ్ వీళ్ళు పరిశోధలచేస్తున్న విద్యార్థినులు. సారస్వతాభిమానులు శలవల్లో నిన్ను చూసి పోదామని వస్తుంటే, మేము వస్తామని వచ్చారు. యేమయిన అభ్యంతరమా శంకరమఠంలో గదిలో ఉంచేవా? అంది నవ్వుతూ.

"నీదంతా హాస్యం. విశ్వం చాలా సంతోషం కలిగింది. మీరంతా వచ్చినందుకు. అంత పెద్ద చదువు చదివి, ఆచార్య అనిపించుకుని గూడా యీ బాబాయిని మరిచిపోకుండా చూడవచ్చావంటే మెచ్చుద్దూ? ఏ ముంబాయో, ఢిల్లియో, ఆగ్రాయో వెళ్లాలనిపించలేదూ అంటే, పట్నం గడబిడలు ఆకర్షించలేదన్నమాట. కూచోండి అంతా మీ సామాను ఆవేపు గదిలో పెట్టిస్తా. దాని పక్కనే స్నానాలగది. ఫలహారం, తేనీరూ సిద్ధంగా వున్నాయి. ఇది మీఇల్లే అనుకుని స్వేచ్ఛగాతిరగాలి. స్నానా

లుకానిస్తారా, బట్టలు మాసినట్లున్నాయి" అని గది చూపిస్తూ రమ్మని చేయి ఊపాడు బాబాయి. ఒక పిల్ల ఆయన చంకలో ఉన్నది. ఒకబ్బాయి ధోతీ పట్టుకునిలబడి పెద్దకళ్ళు చేసిచూస్తున్నాడు. ఒక ఆరేళ్లమ్మాయి గారాలుపోతూ, "నన్ను బడిలో దింపూ, పోనీ నేను పోనా, గౌను తొడుగూ, పూలుపెట్టూ, అని అని నవ్వుతూ పూలదండ తెచ్చింది. మరొక పదేళ్ళ అబ్బాయి తాతయ్యా నాసైకిలు స్టార్టుకావటం లేదు చూడవూ" అని తలుపు ఆనుకొని నిలబడ్డాడు.

అది పెద్ద భవంతి పంచపాళీ, సావడీ, నడవా, నాలుగు పడగ్గదులూ, భోజనాల సావడీ, వంటిల్లూ, సరుకులు పెట్టుకునే గదీ దాని నానుకుని ధాన్యం గది దొడ్డివేపు మళ్లా వరండా వేరేస్నానాలగది పంపూ బావి కొబ్బరిచెట్లూ- అరటిచెట్లు తులసికోటా జామచెట్టు నిమ్మచెట్టు.

అవతలి గొడ్లపాక పాకలో ఆవూ దూడా మరికొంత దూరములో పందిరీ దానికింద గేదె దూడా. దానికి దూరంగా కారుషెడ్డూ దానిలో ఓల్డుమోడలు కారూ. టాపు తీసేయచ్చు.

అతిథుల సంగతి గౌరీనాథంగారే చూస్తూ దయగామాట్లాడుతున్నారు. మనిషి పసిమి చాలా బొద్దుగ వుంటాడు. కళ్ళజోడూ, ఉత్తరీయం పమిటలాగ వేసుకుంటాడు. మెళ్లో గొలుసు రుద్రాక్ష, వగడం- ముత్యం. బంగారుగుండు బంగారంతో చుట్టిన తావళం, దానికి కొలికిపూసగ స్ఫటికం. చేతికి గొలుసూ విసుగులేదు, కోపం లేదు, చిడిముడిపాటూ లేదు. నేత ధోవతీ తెల్లనిది.

రామసీత బాగాపొడగరి. ఆధునికమైనఅలంకరణ తెల్లగా వుంటుంది. చుట్టచుట్టుకుంటుంది.

వంటాయనమీదా, జీతగాళ్లమీదా, చాకలిమీదా, పాలేర్ల మీదా గమ్మీకలు చేస్తుంది. నిటారుగా నిలబడి చేతులు తిప్పుతూ పనిమనిషిచేత పనిచేయిస్తుంది. తాళంచెవులగుత్తి చీర కుచ్చిళ్ల మీద మెరుస్తున్నది.

"యే వూరినించీ రావటం మీరంతా, ఆయన వేపువాళ్లా? బిడియంలేకుండా సరాసరివచ్చేశారే, చుట్టాలురాకపోతే లాయర్ గారు బెంగపడతారు. మరింతమంది వస్తే, మరింత సంతోషం, తన సిరిసంపదలూ, భోగభాగ్యాలూ మంచితనమూ అందరూ గమనించాలి" అని తలవిదిలించింది, రవ్వలదుద్దులు మెరిసినై.

గుండ్రని పెద్దబల్ల ముందున్నారంతా.

ఇంకో గారె వేయించుకో అమ్మా! నేతితో చేసినవి. పట్నంలో యేమున్నదీ, రిఫైండ్ ఆయిల్, ధారా నూనె, రంగూ రుచీ వాసనా లేని నూనెలు. ఉప్మా తీసుకురా శీనయ్యా! పచ్చడి బావున్నదా? టీవీ మీద చూపిస్తారు. వారపత్రికలో పడతాయి, రుచీ, అభిరుచీ, అవి చదివి చెప్పి చేయిస్తా, మోహ మాట పడకండి. ఇడ్లీమీద నెయ్యి వేసుకోవాలి అని కొసరి వేస్తు తినమంటున్నాడు. తాను తింటూ ఒళ్ళో వున్న యీడాది పాపచేతా తినిపిస్తున్నాడు. రామసీత కసిరింది, దాన్ని నేల మీద కూలేయండి అదే తింటుంది. పాకుతున్నప్పుడే వి సట్లో వన్నీ తానే చేత్తో తీసి నోట్లో పెట్టుకునేది. మరీ గారంచేస్తే పెద్దయాక తన మాటే చెగ్గాలంటుంది.

దాన్ని తిననీ, నువ్వు అరవటం మొదలుపెట్టగానే, అది బిక్కమొహం పెట్టి తినదు నువెళ్ళి అతిధులను నాలుగు వీధులూ తిప్పి తీసుకురా, నేనీలోపల వంట యేమి చేయించాలో చూస్తా అని బొడ్లో తాళాలు కారువి తీసి అందించాడు. అతిధులను చూస్తు అన్నాడు. పొలాలూ, అరటితోటలూ, మామిడితోపూ, కొబ్బరితోటా చూసి రండి అని లేచాడు.

దుస్తులేసుకుంటుండగా దొడ్లో నించి గౌరీనాథంగారి గొంతు వినిపించింది. రామీ! బల్లమీదివన్నీ తీసేయాలి, బల్ల తుడవాలి, నేతిచుక్కలు పడ్డాయి, టీ ఒలికింది, సీనయ్యా! ఇవాళ రామికి మరికాస్త ఫలహారం వేయి, ఇంటికి తీసుకుపోతుంది. పిల్లలకు పెట్టుకుంటుంది, నాగులు వచ్చాడా? కూరలు తెచ్చాడా! ఇంట్లో ఉన్నాయా, కత్తితో నేను త్వరగా తరిగిస్తా, పప్పు నానబోయుటమైందా, గ్రైండర్లో రుబ్బియియ్యనా, రోట్లోనే రుబ్బుకుంటావా? ఇవాళ స్పెషల్ వంట చేయాలి. సాయం పట్టనా? ఆయన కాలికి చుట్టుకున్న అబ్బాయిని యెత్తి చంకనేసుకోటం కనబడింది. బిడ్డ కాళ్ళూ చేతులూ ఆడిస్తు మురాతి అనిస్తున్నాడు. రామసీత అరుస్తున్నది, వాడికి యెత్తుడు అలవాటు చేయద్దంటే వినిపించుకోరేం. అసలు పిల్లలకప్పుడే పెళ్ళి చేయద్దు తాతా మామ్మా అంటూ పిల్లలు విసిగిస్తారంటే నన్ను దులిపేసి పెళ్ళిళ్ళు కానివ్వాలి. యేయీడుకా అందం అని మునిగిపోతున్నట్టు, వయస్సు మీరిపోతున్నట్టు పదిహేడో యేటే పెళ్ళి పేలాలు వేగించారు. హయ్యో! కొడుక్కి ఇరవై మూడన్నా నిండలేదు. అప్పుడే వాడికి కొడుకూ, పిల్లల ఉద్యోగాలెక్కడో! ఈయన వీళ్ళని తెచ్చి నా నెత్తి నెక్కించారు. పెళ్ళీడు రాగానే చేసేయాలి,

తల ముగ్గుబుట్టయాక చేయమంటావా నాకు తెలీకడుగు తున్నానూ? అని ఆడదానల్లే చేతులు తిప్పుతూ అంటారు. ఇదేం మొగుడో! ఇదేం లాయరో!

అతిథులు నవ్వుకుంటూ గదిలోంచి వచ్చారు. కారు బయటికి తీసి తలుపులు తీసింది రామసీత. రండి, రండి అని చెయ్యి వూపి అందరూ యెక్కగానే తలుపులు మూసి చక్రం ముందున్నది. నాగా! అని కేక వేయగానే నాగులు వచ్చి స్టార్టర్ పట్టుకుని గిరగిరా తిప్పగానే కారు కదిలింది.

3

రాత్రికి మళ్ళా అంతా బల్లచుట్టూ చేరారు. సీనయ్య అందిస్తున్నాడు, లాయరుగారు వడ్డించారు. మధ్యగా వెండి గిన్నెల్లో గాజు ప్లేట్లల్లో అన్నీ వుంచారు, మారు వడ్డనకి వాటిలో గరిటలుంచారు.

కూచోండి అంతా, నిదానంగా ఒక్కొక్కటే రుచి చూస్తు తినాలి. శీనయ్య ఆస్త్మా యెటాక్ వచ్చి అయాసపడుతుంటే కొన్ని నేనే చేశా, యెలా వున్నాయో చెప్పాలి. అందరి ప్లేట్లలోనూ సూప్ నూ, ఫోర్కు వున్నాయా లేదా చూసి నేయి వడ్డించి ఐస్‌వాటర్ గ్లాసుల్లో పోసి తానూ కూచున్నాడు గౌరీ నాథం.

కూరా అన్నం అప్పడం వడియం తింటున్నాడు. ఫోన్ మ్రోగింది, గౌరీనాథం తన ఒళ్ళో వున్న పిల్లను దింపి వెళ్ళి ఫోనందుకున్నాడు.

రామసీత విసుక్కున్నది.

సరిగ్గా భోజనాలవేళ యెల్లా ఫోన్ వస్తుంది? తర్వాత రిసీవ్ చేసుకోరాదూ, భోజనం చేస్తున్నంతసేపూ లేవటమే, సీనయ్యా! ఆ పిల్లముందు కలిపిన అన్నం గిన్నె పెట్టి స్పూను వేయి అని ఆర్డరు వేసింది.

సీనయ్య వెండిగిన్నె తెచ్చి పిల్లముందుంచాడు. పిల్ల వంటాయన వంకా గిన్నె వంకా చూసి నవ్వింది. దానిమ్మ గింజలంటి పళ్ళు కనబడినై. పిల్ల లేచి వెండిగిన్నె పట్టుకుని తాతగారివేపు వెళ్ళింది.

అంతా ఆటే చూశారు.

అదంతే, అలా తయారుచేశారు దాన్ని. ఆయనే తిని పించాలంటుంది. తనకే అలవాటు, తను వడ్డించుకుంటూ తినేస్తున్నది. మీరు కూడా వడ్డించుకోండి అన్నది.

తాతగారు పాపనెత్తుకుని అన్నం తినిపిస్తు వచ్చారు. కూచున్నారు. రేపు చుట్టాలొస్తున్నారు రామం! ఈ పూళ్ళో మునసబు కూతుర్ని చూసి పొమ్మని యిటో పంపారుట. కదిరితే అక్కడని, వాళ్ళింట్లో దిగరుట, సరాసరి మనింటికే వచ్చేస్తున్నారు. పెళ్ళిచూపులు కానిచ్చి రాత్రికి రైలు అందుకుంటారుట. యోగీశ్వరి యాత్రలకి వెళ్తూ తాళం చెవులిచ్చి వెళ్ళింది. వాళ్ళకి సౌకర్యంగా వుంటుంది, అక్కడుంటారు. నువ్వు విసుగు జెందక, నే చూసుకుంటాగా వాళ్ళ సంగతి, పెళ్ళి ఖాయం చేసి పంపిస్తా. అంతా వచ్చి వాళ్ళే, బీరకాయ పీచు, పిల్లను తెచ్చి పెళ్ళివారెదుటకు చొక్కట్టి చూపించవని గదీ.

పెళ్ళికూతురు నువ్వా కూచున్నమ్మాయా! అని చూస్తారు పెళ్ళివారు. అలా అంటూ నవ్వుతూ కూచుని తాను తింటూ పిల్లచేత తినిపిస్తున్నాడు.

రామసీత విరగబడినవ్వుతూ "చాల్లేండి సరసం" అన్నది అతిథులూ నవ్వారు.

"నవ్వులాట కాదమ్మాయ్‌లూ! ఈమె పెళ్లి చూపులకి పట్నం వెళ్లాము. మాది పల్లెటూరని విన్నదట రామం. "నేను నిన్ను చేసుకోను" అని మొహంమీదే అనేసింది. నేను మాఊరు వదలి యిల్లరికం రానని మావాళ్లు కుండబగలేసివట్టనేశారు. యేమాటకామాటే చెప్పుకోవాలి విశ్వం! ప్రయాణఖర్చులు పెట్టుకున్నారు రామంవేపు వారు. చాలా మర్యాద చేశారు, భోజనానికుండమన్నారు. వున్నాము. మరునాడు ప్రయాణం. ఇహ లాభం లేదని యెవరూ చూడకుండా పోయి, నవల చదువుతూ దొడ్లో జాజిపిందిరి కింద వున్న పెళ్ళి కూతురు కాళ్ళూ గడ్డాలూ పట్టుకుని " నన్ను పెళ్లాడవే చెంచీతా! నీకు బహుపుణ్యముంటుందే చించీతా!" అని పాడితే నవ్వింది. "నిన్ను కాలు కింద పెట్టనీయను ఇటు చెంబటు పెట్టక్కరలేదు. మాటిస్తున్నాను. అన్నాక పెళ్ళికి ఒప్పుకుంది. నా మంచితనం గుర్తించిందివిశ్వం. రామం కట్రపెత్తనం అడిగింది తప్పితే నగా నాణెం కావాలనలేదు కోరిన చీరా, కోరిన నగా కొనిపెట్టక్కరలేక పోయింది."

రామసీత కోపంగా చూసి లేచింది.

'అదేం మట్లాడటం ఆడదానల్లే, లాయరు యిలాగేనా

మాట్లాడేది. యిలాంటి కబుర్లేనా చెప్పేది? మనుషులు మారరు. రేపు యెలాంటి బంధువులొస్తారో! మీ పుట్టింటివాళ్లేనా. మీ పోలికేనేమో. అయితే చచ్చామన్నమాటే. నాకు నిద్ర వస్తున్నది నేపోతున్నా. యెక్కువతిన్నట్టున్నా అతిథులను మీరు ఎంటర్‌టెయిన్ చేయండి. అసలు మీ స్టయిల్ చూడాలని వచ్చారని నా అనుమానం' అని అందరివంకా చూసింది రామసీత. 'నిద్దరాగానే నిద్రపోకపోతే నాకు తలనెప్పి వస్తుంది" అని చెయ్యీ, మూతీ తుడుచుకుని టవల్ కుర్చీ మీదుంచి వెళ్లిపోయింది.

అతిథులటే చూశారు.

'మా రామం మంచిదే. భోజనం కానిచ్చి వెళ్ళింది. అదే పట్నంలో వాళ్లింట్లో అయితే, పొద్దుపోయిందని నిద్రపోయేది లేపి తినిపించేది వాళ్లమ్మ. రేపింకా సందడిగా వుండి, బాగా పొద్దుపోతుంది విశ్వం! మనమంతా గూడా పెళ్లిచూపులకెళ్లాలి అని లేచారు లాయర్‌గారు. పిల్ల ఆయన్ని అనుకొని జోగుతుంది దాన్ని భుజానేసుకుని లేచాడు.

## 4

ఆ వచ్చిన బంధువులూ పిల్లలతోనే వచ్చారు. ఒకవేపున కాఫీ ఫలహారాలౌతున్నాయి. హాలులో పిల్లలు ఘొల్లున గోల రామసీత చిన్నబెత్తం అందుకుని వాళ్లని శిక్షించటానికెళ్లింది యేడుపులు విని గౌరీనాథంగారు లేచి వెళ్ళారు. కిటికీలోంచి అందరూ కనబడుతున్నారు.

'నానా! యీ సైకిలెక్కి తిరుగు నీకోసమని పట్నంనించీ తెప్పించాను. చిట్టీ! ఇంద యీ బొమ్మ చూడు తల విరబోసుకుని

ఉంది. రా। యింద దువ్వెన తల దువ్వు బొమ్మ తీసుకో" చిన్న దువ్వెన చేతికిచ్చాడు. "బుజ్జీ! యీ బంతితో ఆడుకోరా" ప్లాస్టిక్ బంతి రంగు చారలున్నదిచ్చాడు. మరొక అమ్మాయికి స్కిప్పింగ్ తాడు యిచ్చాడు_ ఇంకో బిడ్డకి తాడుతోలాగే రైలూ అలా అందర్నీ ఒక్క దెబ్బవేయకుండా, కసరకుండా, ముద్దు పేర్లతో పిలుస్తూ అల్లరి మాన్పించాడు. నడక వస్తున్న పది నెలల బిడ్డను జీతగాడికందించి నోట్లో పీక వుంచమనిచ్చాడు గౌరీనాథం. మరొకబ్బాయికి క్రికెట్ ఆట సామానిచ్చాడు. ఇంకోడికి గాలి వూదిన ఫుట్‌బాలిచ్చి అల్లరి ఆపించాడు. ఇద్దరు పిల్లల్ని వుయ్యాలల్లో వుంచి వూగించి, ఒక పాలేరునుండమని కిందబడకుండా చూడమన్నాడు. నవ్వుతూ వెళ్ళి రామసీతను రెక్కపట్టుకుని లోపలికి తెచ్చాడు. ఆమె విడలించింది

"కానీ రామం! పోయి సింగారించుకోవాలి యేదో పాపం పిల్లలుగదూ, సందడిచేశారు, అని వీపుమీద రాచి కూచోబెట్టాడు ఉప్మా వున్నప్లేటూ స్పూను ముందుంచాడు కస్సుమన్నది- విదిలించింది

"ఆహా! యేమి డిసిప్లిన్! ఒక్క చురకవేస్తే భయపడి నోరు మూస్తారు. స్పేర్ ది రాడ్ అండ్ స్పాయిల్ ది చైయిల్డు! అన్నారు వాళ్లు మీరిపోరూ? మొక్కై వంగనిది మానై వంగుతుందా" అని వురిమింది.

"తిను తిను ఆకలిమీద యింకా మండిపడతావు. యేం మీరరు. నువ్వు ఒకప్పుడు చిన్నపిల్లవేగా. ఇంతకంటె అల్లరి చేసి యిల్లంతా ఓ కొలిక్కి తెచ్చే వుండచ్చు. నేను చూశానా పెట్టానా" అని తాపీగా ఫలహారం తినసాగాడు.

బంధువులలో ఒకాయన ప్రిన్సిపాల్. పేరు కమలాకరం 'నువ్వు చెప్పేది నా భార్యకూ సరిపోతుంది సరిగ్గా. నేనుదాన్ని యింత పిల్లప్పటినించీ యెరుగుదును. ఆ పిల్ల లు చేసేది ఒక అల్లరా? ఇది అల్లరిచేసి, ఇంటి కప్పెగిరిపోయేట్టు యేడ్చేది. యేదో కొనిబెట్టలేదుట ఇంతా చేస్తే అయిదోయేడో సంగీతం నేరుస్తాననేది. వాళ్ళమ్మ వద్దనేది. దాంతో యిద్దరికీ లడాయి. కూతురుతో గెలవలేక వాళ్ళమ్మ బడికి పంపింది. ఆటల్లో ఫస్టు మా ఆవిడ. కాని చెవుల జూకాలు పారేసుకుని, 'హోయినై హో యినై' అనినవ్వుతూ సాయంకాలం యింటికొచ్చింది వాళ్ళమ్మ గుడ్లెఱ్ఱజేసి కొట్టబోతే వాళ్ళనాన్న అడ్డుపడ్డాడు. ఆయనకి తాకి నది దెబ్బ. నా భార్యారత్నం నవ్వుతూనే వున్నది" గారెలూ, పచ్చడీ తినేస్తూ నవ్వాడు.

"సీనయ్యా! రామానికి టీ వద్దుట. కాఫీ వస్తా. వేడిగా తేవాలి. నెస్‌కేఫ్ కలిపి తీసుకురా. లేవకు రామం కాఫీ వచ్చేస్తు న్నది" అని రామసీతను కూచోబెట్టాడు.

మరొక ఆఫీసర్ ఛీఫ్ ఇంజనీర్. చాలా షోకు చేసుకున్నాడు రిమ్‌లెస్ కళ్ళజోడు, సెంటు పూసుకున్నాడు.

నేను యింత టిఫిను తినలేను గారీ! ఇడ్లీ, టీ చాలు_ వళ్ళొచ్చేస్తుంది. పొట్ట వస్తుంది. అని కులుకుతూ పక్కకిచూసి తన భార్య రాధాకృష్ణమ్మ అన్నీ తినేయటం గమనించి_

కృష్ణా! ఇవిగూడా తిను_ చాలా రుచి_ మల వంటాయన యిలా యేనాడూ చేయడు" అని గారెలప్లేటూ, బజ్జీలప్లేటూ, భార్య ముందుకు పెట్టాడు

రాధాకృష్ణమ్మ మొహమాటపడకుండా తింటూనే అన్నది

మన వంటవాడూ, మనమూనా! హయ్యో! సిగ్గు, సిగ్గు వాడికి మీరన్నా వెరపులేదు నేనన్నా భయంలేదు మరిది గౌరీ నాథం అందరిచేతా చక్కగాపనిచేయిస్తారు మరిదిని చూసైనా నేర్చుకోవాలి మీరు, ప్రిన్స్‌లాగా అలంకరించుకోటం యిష్టం- ఛీఫ్ కాగానె సరా. వంటవాడు మానెస్తాడేమోనన్నట్టు వాడికి వెరుస్తారైపాయె- టీ తాగి లేచింది-

పెళ్లి చూపులకి బయలుదేరారు గౌరీనాథంగారు వంట యేమేం చేయాలో పురమాయించారు- పిల్లలు జాగర్త యెటూ పోనీకండి" అనివనివారిని హెచ్చరించారు- పట్టుబట్ట పట్టులాల్చి పట్టుత్తరీయం వేసుకుని, మెళ్లో గొలుసూ, చేతివాచీ మెరవగా, అకుచెప్పులేసుకుని వచ్చి కారులో కూచున్నాడు రామసీత చక్రం బట్టింది- విసుక్కున్నది అయిపోయినై అప్పగింతలూ, ఇంటి లోకి, బయటికీ తిరుగుతూ అన్నిసార్లు చెప్పాలా? అని కారు స్టార్టు చేసింది-

ఆడపెళ్లివారెదురొచ్చి కారు ఆగాక అంతా ఓగారా? లేదా చూసి లోపలికి తీసికెళ్లారు-

అంతా సుఖాసీనులైనారు. ట్రేల్లో తినేవీతాగేవీ బల్ల మీద ఉంచాడు- పెళ్ళికొడుకు జీడిపప్పు తీసి తినబోయాడు-

తినకురా బుజ్జీ! కతికితే అతకదు- అని చెయ్యి తీసేశాడు తండ్రి-

తల్లి అన్నది మీదంతా చాదస్తం కట్నం అడిగినంతా

చేతులలో వోస్తానున్నారుగా! యెందుకతగదూ! తిననీయండి" అని జీడిపప్పులు కొడుకు చేయిలాగి చేతిలో పుంచింది.

పెళ్లికూతుర్ని తేలేదు- హాల్లోనున్నవారు నవ్వుతూ మాటలాడుకోసాగారు స్వంత విషయాలూ, ఊళ్ళో భోగట్టా, రాజకీయాలూ దొర్లి పోయినవి.

మా తాతయ్య పిల్లలే అస్తి అనుకొని అస్తి తరిగిపోతున్నా పెద్ద చదువులే చదివించాడు ఆడ కూతుళ్ళను గూడాను, స్వంత వ్యవసాయం చేసీ చేసీ ప్రాణం కడజట్టిందాయినకు యేడాది పొడవున భూమికి చాకిరీ చేస్తే, పంట పండితే పండుతుంది లేకపోతే లేదు తిండి వెంపర్లాటేనని తెలుసుకున్నాడు- మా అమ్మేమో బంగారమంటి మాగాణి అమ్మద్దనేది దాంతో యెడమొహం, పెడమొహం అయేది ఇద్దరికీ అని నింపాదిగా అంటున్నారు గౌరీనాధంగారు

జాయింట్ కలెక్టర్ కుసుమ హరనాద్ అన్నాడు.

"మా అమ్మమ్మకి అస్తి పోయిందే అనే విచారమే లేదు పిల్లలంతా యిట్లా అయిపోయినారే అని విచారపడేది.

'యెట్లా అయిపోయినారండీ?" అనడిగాడు సబ్‌జడ్జి సాయికృష్ణ ఆయన ఐ పీ.యస్. పాసైనమ్మాయిని లౌవ్ చేసి, ప్రొపోజ్ చేసి, పెద్దవాళ్లు అనుమతి యివ్వరులే అని తానే సివిల్ మారేజ్ చేసుకున్నాడు. భార్య వేరే జిల్లాలో పని చేయాల్సి వచ్చినా ఆయనకు బాధలేదు. భార్యపేరు సౌందర్య.

సౌందర్య నవ్వుతూ తలాడిస్తూ చెప్పేసింది. "పెళ్లిళ్ల విష

యంలో యెవరిని సంప్రదించలేదండీ అదీ బాధ. చూడటానికి వెళ్తే గౌరవమూ లభించదు. మర్యాదలూ చెల్లవు. నట్టింటకూచుని విస్తరిలో అన్నం తినటానికిలేదు. టేబిల్‌మీల్సు నాకుచాతగాదు వున్న రెండు రోజులూ వస్తే. పిల్లలేమో పులిని చూసినట్టు పారిపోతారు. పనివాళ్ళెత్తుకుంటారని నసబెడ్తారండి అత్తగార్లు."

పెళ్ళి కూతురు తల్లి కమలాదేవి వచ్చి అన్నది. "దాన్ని రెక్కబట్టుకు తేవద్దుటండీ, రావటం లేదు ఇదుగో కట్నం దాచిన సూట్‌కేస్. అప్పగించండి. దీన్ని కాపలా కాయలేక చస్తున్నా" అని పెట్టె వదలి నిలబడింది

"నేపిలుచుకొస్తాలేమ్మా. ఆపెట్టె గాద్రేజ్ బీరువాలో ఉంచి తాళం బిగించు. లాంఛనాలూ, యే మర్యాదలు చెల్లి చాలీ ఫైనల్‌కావద్దూ, రా! అని పెట్టెతీసుకుని లోపలికెళ్లాడు గౌరినాధం వెనకాలే కమలాదేవి.

మరొక మూడు నిముషాలకల్లా పెళ్ళికూతురు సులోచనని రెక్క బట్టుకుని తెచ్చి సోఫాలో కూచోబెట్టాడు గౌరీనాధం,

భార్యా రామసీత పకపకా నవ్వింది. వాళ్ళవల్లగానిది. మీవలనయెట్లా అయిందీ? గబిక్కిన చూస్తే తల్లే అనుకుంటారు అలా ఉన్నారు ఆ ఉత్తరీయం వంటినిండాకప్పుకోవటం దాని లోంచి మీ గొలుసూ, మీ ఒంపుసొంపులూ మందగమనం అని నవ్వుతున్నది.

మీరు మరీనూ రామమ్మ వదినగారూ! నేను అన్నగారిలా చేతికి యెముక కనబడకుండా అంత బొద్దుగావున్నానా? ఇంకా

నిశ్చయ తాంబూళాలు పుచ్చుకోకముందే సరసానికి దిగారే, ఘటకర్ణిలా వుంటావనీ, మగవాడి గొంతనీ అంటారు మీ అన్నగారు నన్ను. అన్నది కమలాదేవి తాను కూచున్నది.

'సులో డార్లింగ్ అని పెళ్లికొడుకు కులుకుతూ నవ్వాడు_

పెళ్లికూతురు తలెత్తి పెళ్లికొడుకును చూసింది

అయితే నచ్చానన్నమాటే, నచ్చకేం చేస్తారెండి, మనిషి వంక మహాలక్ష్మి తీరుస్తుంది" అని తానూ నవ్వింది,

తినాలనుకున్నవారు జీడిపప్పు తిని అరకప్పు టీ తాగారు అంతా లేవటం చూసి పెళ్లికూతురు శిరీష లేచి లోపలికి పరుగు తీసింది

## 5

గౌరీనాథంగారు డైనింగ్ రూమ్‌లో తిరుగుతూ అద్దాల తలుపులున్న అల్మార్లలోని ప్లేట్లూ, గ్లాసులూ తీసి బల్ల మీద అమరుస్తున్నారు

మా అబ్బాయి వివాహం ఖాయంచేశాం, అందరికీ అన్నీ నచ్చాయి, నెనె నచ్చచెప్పి ఖాయపరిపించా, పిల్లరూపం పిల్లాడికి నచ్చింది యింకేమి కావాలి? డబ్బు శాశ్వతమా? పోయేప్పుడు వెంటతీసుకుపోతామా? ఇస్తామన్నంత తీసుకోవాలి, బేరమాడగూడదు పిల్లాడిని ముద్దుగా చూసుకుంటారు, వేడుకలన్నీ చేస్తారు ఆషాఢపట్టీ పంపుతారు, మొదటియేడు దసరాకి, దీపావళికి పిలుచుకెళ్లి సూట్లు కొనిపెడతారు, వాళ్లమ్మాయి పురుడు

పుణ్యం వారే చూసుకుంటారని నచ్చచెప్పాక తాంబూలాలు పుచ్చుకున్నారు. వంటాయన తెచ్చినవి అందుకుని సర్వ్ చేయ సాగాడు

రామసీత ఆశ్చర్యంవెలిబుచ్చింది యెప్పుడిదంతా? నచ్చ చెప్పటమెందుకూ? లెదర్ కేస్ నిండా కరెన్సీ కూరి వియ్యంకుడి కిచ్చారే! పెళ్ళికుమారుడు మీ పోలికేమో ఖర్మ. బీరకాయపీచం టిరి. మీవలనే కులుకుతున్నాడు. ఇంకా వళ్లు రాలేదనుకోండి. అన్నది.

విశ్వంభరి దుస్తులు మార్చుకుని తల అందంగా దువ్వ ...చ్చింది. బల్లముందు కూచున్నది. ఒక్కొక్కరే అంతా ...రు.

శీనయ్య వేడివేడి వంటకాలు మధ్యలో ఉంచాడు. చారు ...వాడు.

'నే పోస్తాలే గిన్నెల్లో! నువెళ్లు శీనయ్యా! ఇవుడే పోస్తే చల్లారిపోతుంది. చారుకు వేడీ, మాటకు వాడీ కావాలి' అంటూ తాను కూచున్నాడు. ఫాన్ తిరుగుతున్నది. రాత్రి తొమ్మిదైంది పిల్లలంతా నిద్రపోయినారు.

బంధువులు రాత్రి రైలుకి వెళ్లిపోతారు. పదకొండున్న రకి రైలు. పెట్టెలు సద్దేశారు.

విశ్వంభరి అన్నది. 'మేము రేపొద్దున తొమ్మిదింటికి బయలుదేరుతాం బాబాయ్! ఆతిధ్యానికి చాలా ధన్యవాదాలు. ఉన్న నాలుగురోజులు సంతోషంగా గడిపాము.'

అప్పుడే! విశ్వం! వారముంటారనుకున్నా.

'ఫోన్ వచ్చింది ఆరుగంటలకి మరోచోటికి పిక్‌నిక్ అరేంజుచేశారుట. వచ్చేయమన్నారు ప్రిన్సిపాల్"

మర్నాడందరూ నమస్కారం చేసి థాంక్స్ చెప్పారు.

గౌరీనాథంగారే వాకిలిదాకా వచ్చి, చంకలో మనుమరాలి చేయి వూపుతూ టాటా చెప్పించారు. ఆళ్ళ నానుకుని నిలబడిన మరో ఇద్దరు పిల్లలూ చేతులూపారు.

## 6

"వాగర్థా వివ సంపృక్తౌ" అని నవ్వుతున్నది పరి చేసే విద్యార్థిని. "మేడమ్! నాకీ శ్లోకం బాగా నచ్చింది. దాస మహాకవి చాలా గొప్పవాడు. యేదో శ్లోకం వున్నదన్నా దేంట్లోవుందో చెపితే లైబ్రరీనుంచి ఆ పుస్తకం తెస్తా. దాని కూడా అంతరార్థం చెప్పించుకుంటా" అంటున్నది.

విశ్వంభరి కుర్చీలో కూచుని నవ్వుతున్నది.

(-)